## మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు?

**మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య**

వేములవాడ, అక్టోబర్ 1: 'మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు? కార్పొరేషన్‌కు కమిటీని ఎప్పుడు ఏర్పాటు చేస్తరు?' అని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాపు కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినందుకే రాష్ట్రంలోని 50 లక్షల మంది కాపులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారని గుర్తుచేశారు. వంద రోజుల్లోనే కాపు కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయమైనప్పటికీ.. కమిటీని ఎప్పుడు నిర్ణయిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌కు రూ.3 వేల కోట్లు ఇవ్వాలని నిరసన తెలిపినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోకాపేటలో రూ. 500 కోట్ల విలువైన భూమి ఇవ్వగా, ప్రభుత్వం ఇచ్చే రూ.50 కోట్లు సరిపోవని అన్నారు.

## కేయూలో విజిలెన్స్ దాడులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1: కాకతీయ యూనివర్సిటీలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ బాలుకోటి, సీఐ రాకేశ్, ఇతర విజిలెన్స్ అధికారుల బృందం కేయూ పాలన భవనంలో విచారణ చేపట్టారు. మాజీ వీసీ తాటికొండ రమేశ్ అక్రమాలపై అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ బాధ్యులు ప్రభుత్వానికి, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం స్పందించి విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. మాజీ వీసీ రమేశ్ అక్రమాలపై అడిగిన సమాచారం పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో విజిలెన్స్ అధికారులు స్వయంగా యూనివర్సిటీకే వచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుత ఇన్‌చార్జి రిజిస్ట్రార్, కంట్రోలర్ నరసింహచారి, వర్సిటీ ఆడిట్, స్టేట్ లోకల్ ఆడిట్ వారి ఫైళ్లను పరిశీలించారు.

# హోంగార్డులంటే అంత చులకనా?

- సర్కారు కూల్చివేతల్లో గాయపడితే పట్టించుకోరా?
- హోంగార్డు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- ఏఐజీ దవాఖానలో గోపాల్‌కు హరీశ్‌రావు పరామర్శ



గచ్చిబౌలి ఏఐజీలో చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, చింతా ప్రభాకర్. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

సంగారెడ్డి, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): హోంగార్డులంటే ప్రభుత్వానికి, పోలీసు ఉన్నతాధికారులకు చులకనగా ఉందా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న సంగారెడ్డికి చెందిన హోంగార్డు గోపాల్‌ను మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్ హోంగార్డు గోపాల్.. ఇటీవల మల్కాపూర్ పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తుండగా శిథిలాలు తగిలి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారని తెలిపారు. గోపాల్‌ను ఒక్క ఉన్నతాధికారి కూడా పరామర్శించలేదని తెలిపారు. గోపాల్ కోలుకునే వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, 4 నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఇంకా మాజీ ఎమ్మెల్యేలు పెద్దరెడ్డి సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

## కారు బోల్తా.. ఐదుగురి దుర్మరణం

- మృతులంతా ఒకే కుటుంబం వారు
- ఆదిలాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం

ఆదిలాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ టీచర్స్ కాలనీకి చెందిన మొహిజొద్దీన్ తన మ్యాక్స్ వాహనంలో కుటుంబ సభ్యులతో కలిసి నిర్మల్ జిల్లా భైంసాకు వెళ్లివస్తున్నాడు. గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మొహిజొద్దీన్ (65), ఆయన అల్లుడు ఖాజా మొయినొద్దీన్ (40), మనుమలు ఉస్మాన్‌నొద్దీన్ (11), ఫరొద్దీన్ (12), మహమ్మద్ అలీ (8) మృతి చెందగా.. కారులో ప్రయాణిస్తున్న ఆయేషా, ఏక్రాలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

### ఖమ్మం జిల్లాలో ముగ్గురు

కారేపల్లి, అక్టోబర్ 1: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా వద్ద మంగళవారం రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు మృతి చెందారు. గుట్టకిందగుంపునకు చెందిన ఉండం సూర్యనారాయణ (45), సుగుణ (42) దంపతులు బైక్‌పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు వెళ్లి వస్తున్నారు. ఓపెన్‌కాస్ట్ సమీపంలోని సోలార్ పవర్‌ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నక్క వెంకటేశ్(35), ఆలియాతండాకు చెందిన ధరావత్ రాజు కారేపల్లి నుంచి పవర్‌ప్లాంట్ వైపు బైక్‌పై వెళ్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. సూర్యానారాయణ, సుగుణ, వెంకటేశ్ అ క్కడికక్కడే మృతిచెందారు. రాజుకు తీవ్రగాయాలు కావడంతో ఇల్లెందు దవాఖానకు తరలించారు.

- **తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు**



*తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామంలో మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. పదోవార్డు వాసులు మాట్లాడుతూ మోటర్ కాలిపోవడంతో నీళ్లు రాక అవస్థలు పడుతున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రమాదేవి హామీతో ఆందోళన విరమించారు.* – నేరేడుచర్ల

- **గుండూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థుల ధర్నా**



*పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం గుండూరు జెడ్పీహెచ్‌ఎస్ ఎదుట మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. పాఠశాలలో మూత్రశాలలు నిర్మించినా.. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వాటిని వినియోగించుకోలేకపోతున్నామని తెలిపారు. మూత్రవిసర్జన కోసం బహిరంగ ప్రదేశాలకు వెళ్లలేక అవస్థలు పడుతున్నట్టు చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టకుండా స్థానిక ప్రజాప్రతినిధులు* – కల్వకుర్తి రూరల్

- **మూడ్రోజుల తర్వాత మళ్లీ మార్కింగ్**



*ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువు పరిసరాల్లో మూడ్రోజుల తర్వాత మంగళవారం అధికారులు మళ్లీ సర్వే చేయడానికి రావడంతో స్థానికులు వారిని అడ్డుకున్నారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగారు. – ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ*

## లడ్డూ వివాదంపై సిట్ దర్యాప్తు నిలిపివేత

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం మంగళవారం సంచలన నిర్ణయం తీసుకున్నది. సిట్ దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. ప్రభుత్వ తరపు లాయర్ల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు డీజీపీ స్పష్టం చేశారు.

## సాగర్ కాల్వలో ముగ్గురు గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం
- మరో ఇద్దరి కోసం గాలింపు

రఘునాథపాలెం, అక్టోబర్ 1 : సాగర్ కాల్వలో పడి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. వీరిలో ఒకరి మృతదేహం లభించగా మిగతా ఇద్దరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన ఖమ్మం అర్బన్ పరిధి దానవాయిగూడెం వద్ద మంగళవారం చోటుచేసుకున్నది. భద్రాద్రి జిల్లా మణుగూరు ప్రాంతానికి చెందిన రోండ వెంకటేశ్వర్లు, చల్లా రమేశ్, ప్రసాద్, బండారు భరత్ సోమవారం ఖమ్మం వచ్చారు. మధ్యాహ్నం దానవాయిగూడెంలో మద్యం సేవించారు. తిరిగి వెళ్లే క్రమంలో దానవాయిగూడెం సాగర్ కెనాల్ వద్ద రాత్రి 10 గంటలకు ఆగారు. కెనాల్ పైకి వెళ్లాలని నిర్ణయించుకొన్నారు. రోండ వెంకటేశ్వర్లు ఆటోలోనే నిద్రించగా మిగిలిన ముగ్గురు సాగర్ కెనాల్ కట్టపైకి వెళ్లారు. అక్కడ స్నానం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. మంగళవారం ఉదయం ఆటోలో నిద్రించిన వెంకటేశ్వర్లు లేచి చూసేసరికి మిత్రులు రాకపోవడంతో కెనాల్ వైపు వెళ్లాడు. అక్కడ తన మిత్రుల దుస్తులు కాల్వ గట్టుపై కనిపించాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాల్వలో గాలింపు చర్యలు చేపట్టగా బండారు భరత్(30) మృతదేహాన్ని గుర్తించారు. మరో ఇద్దరు ఆచూకీ కోసం రాత్రి వరకు గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది.

## బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

- కొంతకాలంగా అఘాయిత్యం
- 4 నెలల గర్భిణిగా తేల్చిన వైద్యులు

గీసుగొండ, అక్టోబర్ 1: వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(12)పై అదే గ్రామానికి చెందిన వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ ప్రభుత్వ పాఠశాలలో బాలిక 8వ తరగతి చదువుతున్నది. ఆమెకు తండ్రి లేడు. అదే గ్రామానికి చెందిన చాపర్తి సాంబయ్య (65) బాలికకు మాయమాటలు చెప్పి కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. బాలిక ఆరోగ్య పరిస్థితిని గమనించిన తల్లి నిలదీయగా విషయం చెప్పింది. మంగళవారం గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు బాలికకు వైద్య పరీక్షలు చేయించారు. బాలిక 4 నెలల గర్భిణిగా నిర్ధారించారు. సాంబయ్యపై పోక్సో కేసు నమోదైంది.

## ఒక్కొక్కరికి మూడు ఉద్యోగాలు

### సత్తాచాటిన నాగర్‌కర్నూల్ జిల్లావాసులు



చంద్రశేఖర్



నరేశ్‌రెడ్డి

చారకొండ/అమ్రాబాద్, అక్టోబర్ 1 : నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ ఇద్దరు యువకులు ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చారకొండ మండల కేంద్రానికి చెందిన పేద కుటుంబం దొడ్ల కళమ్మ, శేఖర్‌రెడ్డి దంపతుల పెద్ద కుమారుడు నరేశ్ రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. హైదరాబాద్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా పట్టుదలతో చదివి పోటీ పరీక్షలు రాయగా.. ఇటీవల హెచ్‌డబ్ల్యూవో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కాగా సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా, సాంఘిక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు.

**మాచారానికి చెందిన చంద్రశేఖర్..**

అమ్రాబాద్ మండలం మాచారానికి చెందిన చంద్రశేఖర్ డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్‌కు సాంఘిక శాస్త్రంలో 8వ ర్యాంక్, ఎస్జీటీలో 15వ ర్యాంక్, భాషా పండిత్ తెలుగులో 3వ ర్యాంక్ సాధించాడు.

## మద్యం తాగించి యువతిపై గ్యాంగ్‌రేప్

**భూపాలపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి**

గిర్మాజీపేట, అక్టోబర్ 1: మద్యం తాగించి యువతిపై ఇద్దరు యువకులు సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. గత నెల 15న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భూపాలపల్లి ప్రాంతానికి చెందిన యువతికి ఓ యువకుడు పరిచయం అయ్యాడు. ఇద్దరి మధ్య చాటింగ్, ఫోన్‌లో మాట్లాడుకోవడంతో పరిచయం మరింత బలపడింది. యువకుడు తన ఇద్దరు మిత్రులతో కలిసి గత నెల 15న యువతిని నమ్మించి కారులో వరంగల్ నగరానికి తీసుకొచ్చాడు. హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకొని యువతికి బీర్లు తాగించి ఇద్దరూ లైంగికదాడికి పాల్పడ్డారు. యువతి ఫిర్యాదు మేరకు మంగళవారం ఇంతెజార్‌గంజ్ పీఎస్‌లో కేసు నమోదైంది.

## పేదల జోలికొస్తే ఊరుకోం:కూనంనేని

సుబేదారి, అక్టోబర్ 1: హైడ్రా పేరు తో హైదరాబాద్‌లో పేదల ఇండ్లను కూల్చితే ఊరుకునేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు.

# డీఎస్సీలో మెరిసిన అభ్యర్థులు

- ముగ్గురికి మూడు ఉద్యోగాల చొప్పున..
- పలువురికి టీచర్ ఉద్యోగాలు

అమ్రాబాద్/చారకొండ/లింగాల/జడ్చర్ల/మూసాపేట/ఆత్మకూరు, అక్టోబర్ 1 : సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాలలో పలువురు అభ్యర్థులు ప్రతిభ చాటారు. ముగ్గురిని మూడు చొప్పున.. మరికొందరిని రెండు చొప్పున ఉద్యోగాలు వరించనున్నారు. అమ్రాబాద్ మండలం మాచారంకు చెందిన చంద్రశేఖర్ మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్‌కు సాంఘిక శాస్త్రంలో 8వ ర్యాంక్, ఎస్జీటీలో 15వ ర్యాంక్, భాషా పండిట్ తెలుగులో 3వ ర్యాంకు సాధించాడు. చారకొండ మండల కేంద్రానికి చెందిన దొడ్ల కళమ్మ, శేఖర్‌రెడ్డి పెద్ద కుమారుడు నరేశ్‌రెడ్డి ఇటీవల హెచ్‌డబ్ల్యూవో ఉద్యోగానికి ఎంపికకాగా.. డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్(సాంఘిక శాస్త్రం) విభాగంలో జిల్లా ఐదో ర్యాంక్, ఎస్జీటీగా ఎంపికయ్యాడు. అలాగే వంగూరు మండలం పోతారెడ్డిపల్లికి చెందిన రమేశ్ ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 81.33 శాతం మార్కులతో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించాడు. అలాగే రామకృష్ణ మ్యాథ్స్‌లో ప్రతిభకనబర్చి ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. జడ్చర్ల మండలం కోడ్గల్‌కు చెందిన శ్వేత ఎస్‌ఏ తెలుగులో జిల్లా ఫస్ట్ రాగా, లాంగ్వేజ్ పండిత్‌లో జిల్లా ఫస్ట్ ర్యాంక్ సాధించి డీఎస్సీ ఫలితాల్లో రెండు ఉద్యోగాలు అర్హత సాధించింది. లింగాల మండల కేంద్రానికి చెందిన ఆఫ్రిన్‌జాబిన్ ఉర్దూలో స్కూల్ అసిస్టెంట్ జిల్లా మొదటి ర్యాంక్, జరీనాబేగం స్కూల్ అసిస్టెంట్ ఉర్దూ విభాగంలో రెండో ర్యాంక్, ఎస్జీటీలో 6వ ర్యాంక్ సాధించారు. అడ్డాకుల మండల కేంద్రానికి వాకిటి ఆంజనేయులు ప్రతిభ కనబర్చి డీఎస్సీ ఎస్జీటీ (స్పెషల్ ఈడీ)లో జిల్లా స్థాయిలో ఫస్ట్ ర్యాంక్, స్కూల్ అసిస్టెంట్‌లో జిల్లా స్థాయిలో 3వ ర్యాంక్ సాధించాడు. ఇతను ఇంతకు ముందే 2008-డీఎస్సీలో ఎస్జీటీకి ఎంపికయ్యాడు. ప్రస్తుతం రైల్వేలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆత్మకూరులో బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కన బట్టల వ్యాపారం చేసే ఖాజాపీర్ కొడుకు మహమ్మద్ పాషా స్కూల్ అసిస్టెంట్ గణితంలో 73.93 శాతం మార్కులతో డిస్ట్రిక్ట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. ప్రతిభ చాటిన అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

## ఒకే గ్రామం నుంచి నలుగురు ఎంబీబీఎస్‌కు ఎంపిక

మల్దకల్, అక్టోబర్ 1 : మండలంలోని బిజ్వారం గ్రామం నుంచి నలుగురు విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించడంపై గ్రామానికి వివిధ పార్టీ నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన గట్టు ఎంపీపీ విజయ్‌కుమార్ కూతురు ఝాన్సీ రాణి, విష్ణు ఆచారి కూతురు సాయి వర్షిణి, అశోక్ రెడ్డి కుమారుడు సాయివర్ధన్‌రెడ్డి, శంకర్ గౌడ్ కూతరు రమ్యలు ఎంపికయ్యారు. ఒకే గ్రామం నుంచి నలుగరు ఎంబీబీఎస్ సీట్లు సాధించడం మా గ్రామానికి ఎంతో గర్వకారణంగా ఉందని మాజీ ఎంపీపీ రాజారెడ్డి, నాయకుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. అలాగే డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని ఉల్గెపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ పోలీస్ తిమ్మప్ప కుమారుడు సవారన్న స్కూల్ అసిస్టెంట్‌గా ఫిజికల్ సైన్స్‌లో ఫస్ట్ రావడంపై గ్రామస్తులు అభినందించారు.

## పెబ్బేరులో డీసీసీబీ బ్యాంక్ ఏర్పాటుకు కృషి

పెబ్బేరు, అక్టోబర్ 1 : పెబ్బేరులో డీసీసీబీ బ్యాంక్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే మేఘారెడ్డి అభ్యర్థన మేరకు ఈ ప్రాంత రైతుల సౌలభ్యతను దృష్టిలో పెట్టుకొని డీసీసీబీ బ్యాంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డిని మార్కెట్ పాలకవర్గం సన్మానించింది. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ గౌని ప్రమోదినీరెడ్డి, వైస్ చైర్మన్ విజయవర్ధన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈర్లదిన్నె రంగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాసగౌడ్, నాయకులు వెంకటేశ్‌సాగర్, సురేందర్‌గౌడ్, మార్కెట్ డైరెక్టర్లు రామన్‌గౌడ్, మోతెరాములు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై సదస్సు

ఎర్రవల్లి చౌరస్తా, అక్టోబర్ 1: ఎర్రవల్లి మండలంలోని వల్లూరు గ్రామంలో నాబార్డు వారి ఆధ్వర్యంలో ఏపీజీబీవీ సాసనూలు బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ వారణాసి రంజిత్ మాట్లాడుతూ మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ప్రమాదవశాత్తు మృతిచెందిన మురళిమోహన్‌రెడ్డి కుటుంబానికి రూ. 20లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు.

## పారిశుధ్యచర్యలు

పాన్‌గల్,అక్టోబర్ 1 : మండలంలోని మాందాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ జయరాములు సాగర్ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య చర్యలు చేపట్టారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తా చెదారాన్ని తొలగించారు.

# డీఎస్సీ అభ్యర్థులకు తప్పని నిరీక్షణ

- రాత్రి 7గంటలైనా రాని 1:3 నిష్పత్తి జాబితా



మహబూబ్‌నగర్ డైట్ కళాశాల వద్ద నిరీక్షిస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 1 : డీఎస్సీ ఫలితాలు కేవలం 55 రోజుల్లేనే ఇచ్చామని 1:3 నిష్పత్తిలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈనెల ఒకటి నుంచి ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించినా.. డీఎస్సీ 2024 అభ్యర్థులకు మొదటి రోజు నిరీక్షణ తప్పలేదు. రాష్ట్రస్థాయిలో నిర్దేశించిన వెబ్‌సైట్‌లో అభ్యర్థులకు సంబంధించిన డేటాను సకాలంలో పొందపర్చకపోవడంతో మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు వచ్చిన అభ్యర్థులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. స్కూల్ అసిస్టెంట్, భాషా పండితులు, పీఈటీ, ఎస్జీటీ, ప్రత్యేక కేటగిరీలో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులకు సంబంధించి 1:3 నిష్పత్తిలో మొత్తం అభ్యర్థులు 3,393 మందితోపాటు వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ-గద్వాల జిల్లాల్లో ఏర్పాటు చేసిన ధ్రువపత్రాల పరిశీలన కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. ఇదిలా ఉండగా, ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాటు చేసిన బృందాల్లోని జీహెచ్‌ఎంలు, సీనియర్ ఉపాధ్యాయులు చేసేది లేక ఆయా కేంద్రాల్లోనే జీవోలు, దస్త్రాల పరిశీలనకు సంబంధించిన అంశాలు, నియమ నిబంధనలపై చర్చించుకున్నారు. ఆయా జిల్లాల డీఈవోలు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పకడ్బందీగా నిర్వహించాలని పలు సూచనలు చేశారు.

## రాష్ట్రస్థాయికి విద్యార్థుల ఎంపిక

గద్వాల రూరల్, అక్టోబర్ 1 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల ఏజీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా, జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇమ్మానుయేలు మంగళవారం ప్రకటనలో తెలిపారు. పుట్‌బాల్, కబడ్డీ అండర్-14, 17విభాగాల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. పుట్‌బాల్ అండర్-17 బాలికల విభాగంలో నందిని, బాలుర విభాగంలో ఫయాజ్, అదేవిధంగా అండర్-14 బాలికల విభాగంలో లక్ష్మి, తేజశ్రీ, హరిణి, రేణుక, అమృత బాలుర విభాగంలో గణేశ్, వీరేశ్, ధర్మతేజ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అదేవిధంగా కబడ్డీ అండర్-17 బాలికల విభాగంలో నందిని, జ్యోతి జోనల్ స్థాయికి ఎంపికయ్యారు. అదే విధంగా అండర్-14విభాగంలో విశ్వనాథ్, అరుణ్ వాలీబాల్ అండర్-17 విభాగంలో యిర్మియా ఎంపికయ్యారు. విద్యార్థులకు పాఠశాల ఆవరణలో సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బీసన్న, హైమావతి, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు లక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## మంచినీటి సహాయకులకు శిక్షణ

మల్దకల్, అక్టోబర్ 1 : మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న మంచినీటి సహాయ కులకు ఎంపీడీవో ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సమావేశానికి సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్ఈ వెంకటరమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీయర్ శ్రీదర్‌రెడ్డిలు హజరైయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో నీటిని వదిలే సహాయకులకు శిక్షణలో భాగంగా నీటి నాణ్యతను పరీక్షించే విధానాన్ని, ల్యాబ్ టెక్నిషియన్ నవీన్,అన్వర్‌లు వివరించారు.ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ నరసన్న, సీనియర్ అసిస్టెంట్ సూర్యప్రకాశ్ రెడ్డి, ఏఈఈలు పరమేశ్, వివిధ గ్రామాలకు చెందిన వాటర్‌మ్యాన్‌లు పాల్గొన్నారు.

## ముగ్గురు సైబర్ నేరగాళ్లు అరెస్టు

- సైబర్ క్రైమ్ డీఎస్పీ రత్నం



పోలీసుల అదుపులో సైబర్ నేరగాళ్లు

కొత్తకోట, అక్టోబర్ 1 : ధని లోన్‌యాప్‌ల ద్వారా అమాయకులను మోసం చేసి డబ్బులను కాజేస్తున్న ముగ్గురు సైబర్ నేరగాళ్లను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. కొత్తకోట మండలానికి చెందిన కుమ్మరి రాజు విశ్వకర్మ లోన్ యాప్ ద్వారా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోయానని కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు క్రైమ్ డీఎస్పీ రత్నం ఆధ్వర్యంలో విచారణ చేపట్టి కేతావత్ దినేశ్, కేతావత్ నరేశ్, పాత్లావత్ విజయ్ అనే ముగ్గురు సైబర్ నేరగాళ్లను అదుపులోకి తీసు కున్నారు. ఇప్పటికే అదుపులోకి తీసుకున్న వారితో కలిపి మొత్తం 13మందిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. వీరంతా 2022లో ఎర్రగట్టు తండాకు చెందిన చిట్టకి రమేశ్ ద్వారా పశ్చిమ బెంగాల్ వెళ్లి అక్కడ సైబర్ మోసాలపై శిక్షణ తీసుకున్నారు. 2023లో దినేశ్ తన తమ్ముడు, మరొక స్నేహితుడిని వెస్ట్ బెంగాల్‌కు తీసుకెళ్లి అక్కడ సైబర్ నేరాలపై శిక్షణ తీసుకొని తిరిగి వచ్చి నేరుగా టీంలు ఫామ్ చేసుకు న్నాడు. ఫేక్ ధని లోన్ యాప్‌ల ద్వారా అమాయక ప్రజల నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ.50 లక్షల పైచిలుకు దోచుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. వారిని అదుపులోకి తీసుకొని కొట్టేసిన రూ.50లక్షల్లో రూ.25 లక్షలు రికవరీ చేసి వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని తెలిపారు. ఈ కేసుల్లో విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ రాంబాబు, ఎస్సై మంజునాథ్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ కుర్మయ్యగౌడ్, పోలీస్ సిబ్బందిని ఎస్పీ రావుల గిరిధర్ అభినందించారు.

## కరాటేలో ప్రతిభ కనబర్చిన వనపర్తి విద్యార్థులు

వనపర్తిటౌన్, అక్టోబర్ 1 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో వనపర్తి విద్యార్థులు ప్రతిభను చాటారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన తైక్వాండో టోర్నమెంట్‌లో బాల బాలికలు అండర్-17, అండర్-14, అండర్-19 విభాగాల్లో ప్రతిభను చాటారు. అండర్-14 బాలికల విభాగంలో హిందు, ఝాన్సీరాణి, తనుశ్రీ, చందన, రాధిక, బాలుర విభాగంలో మోహన్, అండర్-17 బాలికల విభాగంలో కార్తీక, కౌసర్, వైష్ణవి, బాలుర విభాగంలో లోకేశ్, అజయ్, అండర్-19 విభాగంలో ఉదయ్‌కుమార్, శేషాద్రి, వంశీగౌడ్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులు ఎంపిక కావడంపై జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్‌కుమార్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపతి, సుజాత, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, మాస్టర్లు మహేశ్, యుగేందర్, వెంకటేశ్ ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు.

## ఉపకార వేతనాలకు దరఖాస్తులు

గద్వాల రూరల్, అక్టోబర్ 1 : జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరం గానూ పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి సరోజ మంగళవారం ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు అనుగుణంగా నూతన విధివిధానాలను ఈ-పాస్ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు.

## జూరాల @ 7 గేట్లు

గద్వాల/అయిజ, అక్టోబర్ 1 : జూరాల ప్రాజెక్టు జలకళ సంతరించుకున్నది. ఎగువ నుంచి మంగళవారం 84,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. ఏడు గేట్లు ఎత్తారు. కాల్వలు, విద్యుదుత్పత్తి, గేట్ల ద్వారా 88,268 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.050 టీఎంసీలుగా ఉన్నది. అలాగే టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 9,230, అవుట్‌ఫ్లో 10,177 క్యూసెక్కులుగా ఉండగా.. ప్రస్తుతం 101.578 టీఎంసీల నిల్వ ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 29,161, అవుట్‌ఫ్లో 32,020 క్యూసెక్కులుగా నమోదుకాగా.. ప్రస్తుతం 128.01 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 39,626, అవుట్ ఫ్లో 39,473 క్యూసెక్కులుగా నమోదుకాగా.. ప్రస్తుతం 37.54 టీఎంసీల నిల్వ ఉన్నది.

### తుంగభద్ర డ్యాం, ఆర్డీఎస్‌కు వరద

అయిజ, అక్టోబర్ 1 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతున్నది. మంగళవారం ఇన్‌ఫ్లో 9,230 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 10,177 క్యూసెక్కులు ఉంది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన టీబీ డ్యాంలో ప్రస్తుతం 101.578 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 1633 అడుగుల నీటిమట్టానికి గానూ 1631.95 అడుగులు ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 9,310 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 8,673 క్యూసెక్కులు ఉంది. ఆర్డీఎస్ ఆయకట్టుకు 637 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆనకట్టలో 9 అడుగుల మేరకు నీటి మట్టం ఉంది.

### ఆల్మట్టి, నారాయణపుర ప్రాజెక్టులకు..

కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఆల్మట్టి, నారాయణపుర ప్రాజెక్టులకు వరద కొనసాగుతున్నది. ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 29,161 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 32,020 క్యూసెక్కులు ఉంది. ప్రాజెక్టు గరిష్ఠస్థాయి నీటిమట్టం 1705 అడుగులకు గానూ 1704.69 అడుగులు ఉంది. పూర్తిస్థాయి గరిష్ఠ నీటి మట్టం 129.72 టీఎంసీలకు గానూ, ప్రస్తుతం 128.01 టీఎంసీల నిల్వ ఉంది. నారాయణపుర ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 39,626 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 39,473 క్యూసెక్కులు ఉన్నది. గరిష్ఠ స్థాయి నీటి మట్టం 1615 అడుగులకు గానూ ప్రస్తుతం 1614.86 అడుగులు ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 37.40 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 37.54 టీఎంసీలు ఉంది.

## టీజీఎస్ఎస్‌కు ఎంపికైన విద్యార్థినులు

మదనాపురం, అక్టోబర్ 1 : మండలంలోని దుప్పల్లి గ్రామ భారతి టాలెంట్ స్కూల్ విద్యార్థినులు పల్లెపాగ శ్రావ్య, అక్కల శ్రీనిజ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఖాజా మైనోద్దీన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఇటీవలే జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభను కనబర్చి హకీంపేటలో రాష్ట్రస్థాయిలో పోటీ పడినట్లు గుర్తుచేశారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాలోనే 5మంది బాల,బాలికల్లో దుప్పల్లికి చెందిన ఇద్దరు బాలికలు ఉండడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు.

## డిజిటల్ క్రాప్ సర్వేపై ఏఈవోల నిరసన

అయిజ/ వడ్డేపల్లి, అక్టోబర్ 1 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన డిజిటల్ క్రాప్ సర్వేను వ్యతిరేకిస్తూ తెలంగాణ వ్యవసాయ విస్తరణ ఐకాస పిలుపు మేరకు ఏఈవోలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మంగళవాం అయిజ , వడ్డేపల్లి ఏవో కార్యాలయం ఆవరణలో ఏఈవోలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. క్లస్టర్ స్థాయిలో ఒక ఏవో డిజిటల్ క్రాప్ సర్వే చేయడం కష్టతరమని, గ్రామ స్థాయిలో ఏఈవోలకు సహాయకులను నియమించాలని రాష్ట్ర వ్యవసాయ సంచాలకులకు విజ్ఞప్తి చేసినా నియమించకపోవడంతో గ్రామాల్లో సమస్యలు వస్తున్నాయని ఏఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు లోకరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి ఏఈవోలకు సహాయకులను నియమించి సర్వేకు సహకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు యువరాజు తదితరులు పాల్గొన్నారు.